పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా..

- 15 ఏండ్లుగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ
- ఆదర్శంగా నిలుస్తున్న యువ యూత్ సభ్యులు

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, సభ్యులు(ఫైల్)

మట్టి వినాయకుల ప్రతిమలు తయారు చేస్తున్న యువయూత్ సభ్యులు

లింగంపేట, సెప్టెంబర్ 6: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు లింగంపేటలోని యువయూత్ సభ్యులు. పీవోపీతో తయారు చేసిన గణపతులతో పర్యావరణం దెబ్బతింటుదని, 15 సంవత్సరాలుగా మట్టి వినాయకులను తయారు చేసి, పంపిణీ చేస్తున్నారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన 11 మంది యువ యూత్ పేరిట సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సంఘంలో ఉన్న ప్రతి సభ్యుడూ నెలా కొన్ని డబ్బులు వేసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వీటితోపాటు ప్రతి సంవత్సరం వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నారు. పండుగకు వారం రోజుల ముందు మట్టిని సేకరిస్తారు. సుమారు రెండువేల వినాయకులను తయారు చేసి పంపిణీ చేస్తుంటారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు వినాయకుల ప్రతిమలను పంపిణీ చేస్తుంటారు. రసాయనాలతో తయారు చేసే విగ్రహాలతో చర్మ సంబంధ వ్యాధులు వస్తాయని, పర్యావరణం దెబ్బతింటుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మట్టి వినాయకుల తయారీ కోసం ప్రతి సంవత్సరం రూ.25వేలు వెచ్చిస్తుంటారు. గతంలో కామారెడ్డి కలెక్టర్లుగా పని చేసిన సత్యనారాయణ, శరత్, జితేశ్ వీ పాటిల్ చేతుల మీదుగా వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలకు అధికారుల నుంచి అభినందనలు అందుకున్నారు. వారి సేవలను గుర్తించి జ్ఞాపికలను అందజేసి సన్మానించారు.

స్వామి వివేకానంద ఆదర్శం..

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువయూత్ ఏర్పాటు చేశాం. స్వామి వివేకానంద చెప్పిన 'యువత మేలుకో.. సమాజసేవకు పూనుకో' అనే నినాదమే సంఘం ఏర్పాటుకు దారి తీసింది. సమాజ సేవ చేస్తూనే సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం సహకారం అందిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతాం.

- బొల్లు శ్రీకాంత్, యువ యూత్ అధ్యక్షుడు

ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలి

రాజంపేట్, సెప్టెంబర్ 6 : ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో రంగనాథరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. 18 ఏండ్లు నిండిన వారిని ఓటరుగా చేర్చుకోవాలని, మృతి చెందిన వారిని తొలగించాలని సూచించారు. అనంతరం గుండారం గ్రామంలో పర్యటించారు. ఆయన వెంట తహసీల్దార్ అనిల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వరద బాధితులకు ఆహార కిట్ల అందజేత

బాన్సువాడ, సెప్టెంబర్ 6 : ఖమ్మంలో జూబ్లీపూర కాలనీ మున్నేరు వాగు ముంపు వరద బాధితులను తెలంగాణ పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు 500 మందికి ఆహార కిట్లను తెలంగాణ ప్రభుత్వం ద్వారా అందజేశారు. తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, ఎంపీడీవో రవీందర్, కౌన్సిలర్ బాణాల లక్ష్మణ్, సత్యంబాబు ఉన్నారు.

బీబీపేట పెద్ద చెరువు సందర్శన

బీబీపేట్, సెప్టెంబర్ 6 : బీబీపేట పెద్ద చెరువు నిండుకుండలా మారి అలుగు పారడంతో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అధికారులతో కలిసి శుక్రవారం సందర్శించారు. చెరువు వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు నష్ట పోయిన అన్నదాతలను ఆదుకుంటామని, రుణమాఫీ జరగని రైతుల కోసం గ్రామాల్లో సర్వే చేసి కలెక్టర్ కార్యాలయంలో సహాయ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

నూతన భవనం మంజూరు చేయండి

బాన్సువాడ, సెప్టెంబర్ 6 : పట్టణంలో నూతన ఏటీవో భవనాన్ని మంజూరు చేయాలని కార్యాలయం సిబ్బంది కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కార్యాలయం లోపల పూర్తిగా తడిసిపోయింద న్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం కార్యాలయంలో మరమ్మతుల కోసం రూ.లక్ష మంజూరు చేసిం ది. టైల్స్, పీవోపీ, కలర్ వేసి తూతూ మంత్రంగా పనులు కానిచ్చారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు కార్యాలయం పూర్తిగా తడిసి ముద్దయ్యిందని ఏటీవో జగన్ తెలిపారు. భయంతో విధులు నిర్వహించా ల్సి వస్తోందన్నారు. పెచ్చులు ఊడిపోతున్నాయని, వైర్లు వేలాడుతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రామారెడ్డి, సెప్టెంబర్ 6: చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలోని కొట్టు నర్సింహులు ఇంట్లో ఆగస్టు 31వ తేదీన చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన నిందితుడు బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కన్నాపూర్ తండాకు చెందిన కాట్రోత్ మహిపాల్ చోరీ చేసినట్లు గుర్తించారు. అతడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి చోరీ చేసిన వస్తువులతోపాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. కేసును ఛేదించడంతో ఏఎస్సై లచ్చిరాంనాయక్, హెడ్ కానిస్టేబుల్ దేవాగౌడ్, కానిస్టేబుళ్లు పవన్, సాయిలు, రమేశ్ చాకచక్యంగా వ్యవహరించారని ఎస్సై వారిని అభినందించారు.

ప్రమాదకరంగా చద్మల్ చెరువు కట్ట

కుంగిన చద్మల్ చెరువు కట్ట

గాంధారి, సెప్టెంబర్ 6: మండలంలోని చద్మల్ గ్రామ సమీపంలోని చెరువు కట్ట ప్రమాదకరంగా మారింది. ఇటీవల 18 లక్షల రూపాయల ఇరిగేషన్ నిధులతో చెరువు కట్ట బలోపేతం పనులను చేపట్టారు. పనులు చేసి ఆరు నెలలు గడువక ముందే పగుళ్లు ఏర్పడి, దానిపై వేసిన మట్టి కిందికి జారింది. కాంట్రాక్టర్ పనులను నాసిరకంగా చేపట్టడంతో ఇలా జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు కట్టను బలోపేతం చేయించాలని వారు కోరుతున్నారు.

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం కృషి చేయాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 6 : మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇంపాక్ట్ స్టార్టప్‌డ్ ట్రైనర్ మోటివేషనల్ స్పీకర్ రమేశ్ చైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడి మత్తులో సంఘవిద్రోహ చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు కష్టపడి పిల్లల భవిష్యత్తు బాగుండాలని చదివిస్తుంటే వారుమాత్రం డ్రగ్స్ మత్తులో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వసతి గృహం నిర్వాహకుడు నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఒకరి అరెస్టు

ఏర్గట్ల, సెప్టెంబర్ 6: పలుచోట్ల బంగారు చైన్లను ఎత్తుకెళ్లిన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు భీంగల్ సీఐ నవీన్ తెలిపారు. సీఐ నవీన్ కథనం మేరకు.. మండల కేంద్రం శివారులోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఎస్సై రాము సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అదే సమయంలో మెండోర మండలం దూదిగాం గ్రామానికి చెందిన చవాన్ కిరణ్ సింగ్ అనే యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులో తీసుకొని తనిఖీ చేశారు. మూడు బంగారం పుస్తెల తాళ్లు దొరికాయి. నిందితుడిని విచారించగా మెండోర, మోర్తాడ్, ముప్కాల్, ఏర్గట్ల మండలాల పరిధిలో నాలుగు చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి మూడు పుస్తెల తాళ్లతోపాటు ఒక పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై రాముతోపాటు సిబ్బంది వినయ్, శ్రీధర్, నవీన్ చంద్రను సీఐ అభినందించారు.